క్లుప్తంగా

విద్యాభివృద్ధికి ప్రభుత్వం పెద్దపీట



ట్యాబ్‌లు పంపిణీ చేస్తున్న ఎంపీపీ దీప

నింద్ర: విద్యాభివృద్ధికి ప్రభుత్వం పెద్దపీట వేస్తోందని, ప్రభుత్వ ప్రోత్సాహకాలను విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని ఎంపీపీ దీప అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలోని జెడ్పీ హైస్కూల్‌లో 8వ తరగతి విద్యార్థులకు ఆమె ట్యాబ్‌లను పంపిణీ చేశారు. ఆమె మట్లాడుతూ కాలానుగుణంగా సాంకేతకతను పెంచేందుకే ప్రభుత్వం ట్యాబ్‌లను పంపిణీ చేస్తోందని తెలిపారు. వైస్ ఎంపీపీ శుభ, ఎంఈవో వసుమతి, సర్పంచ్ బాబురెడ్డి, ఉపాధ్యాయులు శివయ్య, సురేష్ తదితరులు పాల్గొన్నారు.

తడుకు ఆర్‌ఎస్ జెడ్పీ హైస్కూల్‌లో..



పుత్తూరు : విద్యార్థులకు ట్యాబ్‌ల పంపిణీ

పుత్తూరు: వడమాలపేట మండలం తడుకు ఆర్‌ఎస్ జెడ్పీ హైస్కూల్‌లో శుక్రవారం విద్యార్థులకు ట్యాబ్స్ పంపిణీ చేశారు. ఈ సందర్భంగా సచివాలయ కన్వీనర్ సురేష్‌రాజు మాట్లాడుతూ ప్రభుత్వం అందిస్తున్న ప్రోత్సాహకాలను సద్వినియోగం చేసుకుంటూ విద్యార్థులు ఉన్నత శిఖరాలను అధిరోహించాలని సూచించారు. విద్యాభివృద్ధికై అమ్మ ఒడి, విద్యా దీవెన, వసతి దీవెన, విద్యా కానుక, జగనన్న గోరుముద్ద, వైఎస్సార్ సంపూర్ణ పోషణ, నాడు–నేడు వంటి పథకాలు అమలవుతున్నాయని తెలిపారు. హెచ్‌ఎం రవిశంకర్‌రెడ్డి, స్కూల్ కమిటీ చైర్మన్ వర్మ పాల్గొన్నారు.

నేడు మండల సర్వసభ్య సమావేశం

శ్రీరంగరాజపురం : మండల సర్వసభ్య సమావేశం శనివారం ఉదయం ఎంపీపీ సరిత అధ్యక్షతన నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ కృష్ణయ్య తెలిపారు. ఆయన శుక్రవారం మాట్లాడుతూ సమావేశానికి జెడ్పీటీసీ, ఎంపీటీసీ సభ్యులు, సర్పంచ్‌లు, సింగిల్‌విండో అధ్యక్షులు, ప్రజాప్రతినిధులు తప్పక హాజరు కావాలని కోరారు.

కాలుష్య నివారణ అందరి బాధ్యత



మాట్లాడుతున్న అబ్రహం

కార్వేటినగరం: పర్యావరణ కాలుష్య నివారణ అందరి బాధ్యత అని తిరుపతి ఎస్వీ యూనివర్సిటీ సలహాదారు అబ్రహం పేర్కొన్నారు. ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో శుక్రవారం రసాయన శాస్త్ర విభాగం ఆధ్వర్యంలో పర్యావరణ కాలుష్యం–జీవరాశులపై దాని ప్రభావం అనే అంశంపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. ముఖ్య అతిథిగా హాజరైన అబ్రహం, కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ విజయులురెడ్డి మాట్లాడుతూ అనేక రకాల కాలుష్యం, వాటి కారణాలు, ప్రభావాలు, నియంత్రణ చర్యలను వివరించారు. ఈ కార్యక్రమంలో అధ్యాపకులు హరిబాబు, శివరామకృష్ణ, కార్తీక్, శ్రీనివాసులు, విద్యార్థులు పాల్గొన్నారు.

నేడు ఆడుదాం ఆంధ్రా ర్యాలీ

నగరి : రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న ఆడుదాం ఆంధ్రా క్రీడలకు సంబంధించి అవగాహన ర్యాలీని శనివారం ఉదయం 11 గంటలకు నిర్వహిస్తున్నట్లు మున్సిపల్ కమిషనర్ కేఎల్‌ఎన్ రెడ్డి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. టవర్‌క్లాక్ సెంటర్ నుంచి ఓంశక్తి ఆలయం వరకు ర్యాలీ ఉంటుందని, క్రీడా శాఖ మంత్రి ఆర్కేరోజా ఈ ర్యాలీలో పాల్గొంటారని పేర్కొన్నారు.

రక్తదానం ప్రాణదానంతో సమానం



రక్తదానం చేస్తున్న విద్యార్థులు

నగరి : రక్తదానం ప్రాణదానంతో సమానమని ప్రభుత్వ డిగ్రీకళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ వేణుగోపాల్ అన్నారు. శుక్రవారం డిగ్రీ కళాశాలలో ఎన్‌సీసీ, ఎన్‌ఎస్‌ఎస్, లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో రక్తదాన శిబిరం నిర్వహించారు. ప్రారంభ సమావేశంలో రక్తదాతలకు సిద్ధం చేసిన టీషర్టులను ప్రిన్సిపల్ ఆవిష్కరించారు. 43 మంది విద్యార్థులు రక్తదానం చేశారు. రక్తదానం చేసినవారికి నగరి లయన్స్ క్లబ్ వారు టీ షర్టులు, సర్టిఫికెట్లు ప్రదానం చేశారు. చిత్తూరు ప్రభుత్వ ఆస్పత్రి మెడికల్ ఆఫీసర్ టీఎన్ అమర్‌నాథ్ రక్తాన్ని సేకరించారు. వైస్ ప్రిన్సిపల్ భాస్కర్‌రాజు, ఎన్‌సీసీ ఆఫీసర్ భాస్కర్, ఐక్యూ కోఆర్డినేటర్ ఇందిరా ప్రియదర్శిని, నగరి లయన్స్ క్లబ్ అధ్యక్షుడు మోహన్, ఉపాధ్యక్షుడు డాక్టర్ మంజుల, డైరెక్టర్లు ప్రభాకర్‌రాజు, రవిబాబు, సభ్యులు రామ్‌మోహన్, మహ్మద్ షఫీ, నందగోపాల్, జీవన్, ప్రభుత్వ ఆస్పత్రి సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

విద్యే వెలకట్టలేని సంపద

- పర్యాటక శాఖ మంత్రి ఆర్కే రోజా
- కళాశాల సెమినార్ హాల్ పునర్నిర్మాణానికి భూమి పూజ
- రోజా చారిటబుల్ ట్రస్టు నుంచి రూ.12 లక్షల సాయం



సెమినార్ హాల్ పునర్నిర్మాణానికి భూమి పూజ చేస్తున్న మంత్రి ఆర్కే రోజా

పుత్తూరు: విద్యా సంపదను వెలకట్టలేమని, విద్యను పంచే కొద్దీ పెరుగుతుందని రాష్ట్ర పర్యాటక, సాంస్కృతిక, యువజన, క్రీడా శాఖ మంత్రి ఆర్కే రోజా అన్నారు. శుక్రవారం పట్టణంలోని ఎస్‌ఆర్‌ఎస్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలోని సెమినార్ హాల్ పునర్నిర్మాణానికి మంత్రి రోజా భూమి పూజ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ విద్యార్థులన్నా, విద్యాలయాలన్నా తనకు ఎంతో ఇష్టమని, అందుకే ఈ రంగానికి తన వంతు సాయం అందిస్తున్నట్లు తెలిపారు. రోజా చారిటబుల్ ట్రస్ట్ ద్వారా రూ.12 లక్షల వ్యయంతో సెమినార్ హాలును అందంగా తీర్చిదిద్దనున్నట్లు పేర్కొన్నారు. సీఎం జగనన్న సైతం విద్యా రంగంలో విప్లవాత్మక సంస్కరణలను చేపట్టారని తెలిపారు. అమ్మ ఒడి, విద్యా దీవెన, వసతి దీవెన, విద్యా కానుక, జగనన్న గోరుముద్ద, వైఎస్సార్ సంపూర్ణ పోషణ, నాడు–నేడు వంటి పథకాల ద్వారా విద్యాభివృద్ధికై విశేష కృషి చేస్తున్నారని కొనియాడారు. దేశానికి స్వాతంత్ర్యం వచ్చి 75 ఏళ్ల చరిత్రలో ఓటు హక్కులేని పిల్లలపై రూ.వేల కోట్లు ఖర్చు పెట్టిన ఏకైక ముఖ్యమంత్రి ఒక్క జగన్‌మోహన్‌రెడ్డి మాత్రమేనని గర్వంగా చెబుతున్నానని అన్నారు. ప్రభుత్వం అందిస్తున్న అవకాశాలను అందిపుచ్చుకుని ప్రతి విద్యార్థి ఉన్నత లక్ష్యాలను సాధించాలని ఆకాంక్షించారు. అంతకు ముందు కళాశాలలోని సరస్వతీదేవి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ జి.శ్రీనివాసులురెడ్డి, మున్సిపల్ చైర్మన్ ఏ.హరి, వైస్ చైర్మన్లు డి.శంకర్, డి.జయప్రకాష్, ఎంఎల్‌ఓ దిలీప్, కౌన్సిలర్ ఏకాంబరం, వైఎస్సార్‌సీపీ నాయకులు జయచంద్రన్, ప్రసాద్, గోపి, అధ్యాపకులు పాల్గొన్నారు.

ఒకరికొకరు సహకరించుకోవాలి



సన్మానం అందుకున్న విశ్రాంత ఉద్యోగులు

పుత్తూరు: ప్రభుత్వ విశ్రాంత ఉద్యోగులు ఒకరికి ఒకరు తోడుగా నిలవాలని, వృద్ధాప్యం పైనపడిందని నిరుత్సాహ పడకుండా సేవ, ఆధ్యాత్మిక కార్యక్రమాల్లో పాల్గొనాలని ప్రభుత్వ రిటైర్డ్ ఎంప్లాయిస్ (ఏపీ ఆర్‌సీఆర్‌ఈ) రాష్ట్ర అధ్యక్షుడు పీఎస్‌ఎస్‌ఎస్‌పీ శాస్త్రి పిలుపునిచ్చారు. శుక్రవారం పుత్తూరు విశ్రాంత ఉద్యోగుల భవనంలో జాతీయ పెన్షనర్స్ దినోత్సవాన్ని పురస్కరించుకుని 80 ఏళ్లు దాటిన విశ్రాంత ఉద్యోగులను సన్మానించారు. ముఖ్య అతిథిగా విచ్చేసిన శాస్త్రి మాట్లాడుతూ రాష్ట్ర వ్యాప్తంగా 315 సంఘాలలో 3 లక్షలకు పైగా పెన్షనర్లు ఉన్నారని తెలిపారు. ప్రతి జిల్లా సంఘంతో ప్రతి ట్రెజరీ పరధిలోని సంఘాలు సమన్వయం చేసుకుంటూ ఒకరి ఒకరు సహకరించుకోవాలని సూచించారు. పెన్షన్ పొందడంలో ఏవైనా సమస్యలు ఎదురైతే సంఘటితంగా పరిష్కరించుకోవాలని సూచించారు. అనంతరం తిరుపతికి చెందిన సంస్కార్ ఫౌండేషన్ వారి సౌజన్యంతో 80 ఏళ్లు నిండిన విశ్రాంత ఉద్యోగులు 20 మందిని సత్కరించారు. పుత్తూరు సంఘం అధ్యక్షుడు బి.భాస్కర్‌రాజు అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో రాష్ట్ర నాయకులు టి.జయరామనాయుడు, ఐ.లక్ష్మీనారాయణ, పి.నాగరాజు, కృపావరమ్మ, స్థానిక నాయకులు యుగంధర్‌రాజు, గుణశేఖర్‌రెడ్డి, అరుణాచలరెడ్డి, రవిశంకర్, రామచంద్రరాజు, బాలసుబ్రమణ్యం, రామూర్తిరాజు, కుప్పయ్య, తదితరులు పాల్గొన్నారు.

ఆవిష్కరణల వైపు మొగ్గు చూపాలి

వెదురుకుప్పం: ఆవిష్కరణల వైపు మొగ్గు చూపాలని ప్రిన్సిపల్ అన్నపూర్ణ శారద అన్నారు. జాతీయ గణిత దినోత్సవాన్ని పురస్కరించుకుని శుక్రవారం మండలంలోని చవటగుంట డాక్టర్ వైఎస్సార్ డిగ్రీ కళాశాలలో శ్రీనివాస రామానుజన్ చిత్రపటానికి నివాళులర్పించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ గణిత శాస్త్రంలో ప్రావీణ్యం పొందాలన్నారు. అధ్యాపకులు ప్రభాకరావు, వెంకటేశు, చంద్రబాబు, మంగళగౌరి పాల్గొన్నారు. వెదురుకుప్పం జెడ్పీ హైస్కూలో గణిత నమూనా ప్రదర్శన పోటీలు నిర్వహించి, బహుమతులు అందజేశారు. హెచ్‌ఎం శ్రీనివాసులు పాల్గొన్నారు.

గణితం సకల సృష్టికి మూలం

కార్వేటినగరం: గణితం సకల సృష్టికి మూలమని ప్రభుత్వ డిగ్రీకళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ విజయులురెడ్డి అన్నారు. ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో శుక్రవారం గణిత దినోత్సవాన్ని జరుపుకున్నారు. ప్రిన్సిపల్ మాట్లాడుతూ గణితశాస్త్రం సకల శాస్త్రాలకు మూలమని పేర్కొన్నారు. గణిత అధ్యాపకుడు డాక్టర్ ధనంజయరెడ్డి మాట్లాడుతూ గణిశాస్త్ర పితామహుడు శ్రీనివాస రామానుజాన్ని ఆదర్శంగా తీసుకుని విద్యార్థులు గణితంలో పోటీపడి రాణించాలని సూచించారు. అనంతరం గణితంలో విద్యార్థులకు క్విజ్, వక్తృత్వ పోటీలు నిర్వహించి ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు బహుమతులు అందించారు. కార్యక్రమానికి ముందుగా రామానుజం చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. జిల్లా విద్యాశిక్షణా సంస్థ (డైట్), కత్తెరపల్లి, డీఎం పురం ఉన్నత పాఠశాలల్లో జాతీయ గణిత దినోత్సవాన్ని ఘనంగా జరుపుకున్నారు. కత్తెరపల్లి ఉన్నత పాఠశాలలో విద్యార్థులు రామానుజన్ చిత్రపటాన్ని ముగ్గుపిండితో అత్యంత సుందరంగా తీర్చిదిద్దారు. ఈ కార్యక్రమంలో హెచ్‌ఎంలు హేమారెడ్డి, కేశవులు, అధ్యాపకులు హరిబాబు, సుబ్బారావు, డాక్టర్ బాబు, రాజశేఖర్, శివరామకృష్ణ, డైట్ అధ్యాపకులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఘనంగా గణిత దినోత్సవం

విజయపురం (నగరి) : విజయపురం మండలం శ్రీహరిపురం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో శుక్రవారం జాతీయ గణిత దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ముందుగా గణిత శాస్త్రవేత్త శ్రీనివాస రామానుజం చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. హెచ్‌ఎం సోమశేఖర్ మాట్లాడుతూ ప్రతి ఒక్కరు గణితంపై మక్కువ పెంచుకోవాలని తెలిపారు. శ్రీనివాస రామానుజం బ్రిటీష్ పాలనలో గణిత మేధావుల్లో ఒకరిగా నిలిచి దేశానికి ఖ్యాతిని తీసుకొచ్చారని పేర్కొన్నారు. విద్యార్థులు గణితశాస్త్రానికి సంబంధించి నమూనాలను ప్రదర్శించారు. సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. ఉపాధ్యాయు లు పాల్గొన్నారు.

గణితంపై మక్కువ పెంచుకోవాలి

పుత్తూరు: విద్యార్థులు పాఠశాల స్థాయి నుంచే గణితాన్ని మక్కువతో అభ్యసించాలని ఎస్‌ఆర్‌ఎస్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ జి.శ్రీనివాసులురెడ్డి అన్నారు. శుక్రవారం కళాశాలలో జాతీయ గణిత దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ భారతదేశ గణిత శాస్త్రవేత్త శ్రీనివాస రామానుజం జయంతి రోజును గణిత శాస్త్ర దినోత్సవాన్ని జరుపుకుంటున్నట్లు తెలిపారు. నేటి సమాజంలో గణిత శాస్త్రం ఎంతో ప్రాముఖ్యతను సంతరించుకొందని తెలిపారు. అంతకు ముందు శ్రీనివాస రామానుజం చిత్ర పటానికి పూల మాల వేసి నివాళులర్పించారు. విద్యార్థులకు గణిత శాస్త్ర పోటీలు నిర్వహించి, బహుమతులు అందజేశారు. వైస్ ప్రిన్సిపాల్ వి.వీరయ్య, అధ్యాపకులు పాల్గొన్నారు.

శ్రీరంగరాజపురంలో

శ్రీరంగరాజపురం : గణిత శాస్త్ర పితామహుడు శ్రీనివాస రామానుజన్ జయంతిని పురస్కరించుకుని మండలంలోని అన్ని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో జాతీయ గణిత దినోత్సవం ఘనంగా నిర్వహించారు. ఎంఈఓ అరుణాచలంరెడ్డి మాట్లాడుతూ శ్రీనివాస రామానుజన్ కనుగొన్న ఆవిష్కరణలు, సూత్రాలను వివరించారు. కార్యక్రమానికి ఎంఈఓ–2 సబర్మతి, హెచ్‌ఎం రమేష్, ఉపాధ్యాయులు హిమచలపతి, సత్య తదితరులు పాల్గొన్నారు.



వెదురుకుప్పం: మాట్లాడుతున్న ప్రిన్సిపల్ అన్నపూర్ణ శారద



పుత్తూరు: మాట్లాడుతున్న ప్రిన్సిపల్ శ్రీనివాసులురెడ్డి

సమష్టి కృషితోనే మండలాభివృద్ధి



సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీపీ హేమలతారెడ్డి



హాజరైన ప్రజా ప్రతినిధులు, అధికారులు

పెనుమూరు(కార్వేటినగరం) : మండల అభివృద్ధికి అధికారులు, ప్రజా ప్రతినిధులు సమష్టిగా కృషి చేయాలని ఎంపీపీ హేమలతారెడ్డి అన్నారు. ఎంపీడీవో కార్యాలయంలో శుక్రవారం ఎంపీపీ అధ్యక్షతన మండల సర్వ సభ్య సమావేశం నిర్వహించారు. అందులో ఎంపీపీ మాట్లాడుతూ అధికారులు గ్రామాల్లో పర్యటించి మౌలిక వసతులపై ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. ప్రజాప్రతినిధులు తెచ్చిన సమస్యను ఎప్పటికప్పుడు పరిష్కారం చూపాల్సిన బాధ్యత అధికారులపై ఉందని చెప్పారు. డీఆర్‌డీఏ ఏపీఎం హరికృష్ణారెడ్డి మాట్లాడుతూ సున్నావడ్డీ రుణాలకు రూ.6.21కోట్లు ప్రభుత్వం విడుదల చేసిందని తెలిపారు. అనంతరం ఉద్యానవన శాఖ అధికారి వింధ్య మాట్లాడుతూ ట్రాక్టర్లకు స్ప్రేలు, తైవాన్ స్ప్రేయర్లు కొనుగోలుకు ప్రభుత్వం 50 శాతం రాయితీ కల్పిస్తుందని వెల్లడించారు. పీహెచ్‌సీ డాక్టర్ హర్షవర్ధన్‌రెడ్డి మాట్లాడుతూ జనవరి 1 నుంచి రెండో విడత జగనన్న ఆరోగ్య సురక్ష నిర్వహించనున్నట్లు తెలిపారు. మండలానికి వంద ఫారం పాండ్స్ మంజూరైనట్లు ఏపీవో మీనాకుమారి తెలిపారు. హౌసింగ్ ఏఈ రవి మాట్లాడుతూ ప్రభుత్వం నిర్వహించిన గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో ఇళ్ల నిర్మాణం కోసం 270 మంది అర్జీలు ఇచ్చారని చెప్పారు. అందులో 179 మందిని అర్హులుగా గుర్తించి అనుమతులు మంజూరు చేశామన్నారు. ఈ కార్యక్రమంలో జెడ్పీటీసీ దొరస్వామి, ఏఎంసీ చైర్మన్ బండి కమలాకర్‌రెడ్డి, సింగిల్‌విండో అధ్యక్షుడు గోవిందరెడ్డి, యశోదారెడ్డి, ఎంపీడీవో నీలకంఠేశ్వర్ రెడ్డి, ట్రైనీ డిప్యూటీ కలెక్టర్ లక్ష్మీప్రసన్న, ట్రైనీ డీఎస్పీ పావన్‌కుమార్ పాల్గొన్నారు.

మధ్యాహ్న భోజనం తనిఖీ

వెదురుకుప్పం: మండలంలోని చిన్నబొమ్మయ్యల్లె ప్రాథమిక పాఠశాలలో అమలవుతున్న మధ్యాహ్న భోజనాన్ని బొమ్మయ్యపల్లె సర్పంచ్ గోవిందయ్య శుక్రవారం తనిఖీ చేశారు. జగనన్న గోరుముద్ద కింద పిల్లలకు నాణ్యమైన భోజనం పెడుతున్నారా అంటూ ఆరా తీశారు. వండిన భోజనాన్ని రుచి చూశారు. మెనూ ప్రకారం పౌష్టికాహారం అందించాలని సూచించారు.

ఆడుదాం ఆంధ్రను విజయవంతం చేద్దాం

పాలసముద్రం : ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహించనున్న ఆడుదాం–ఆంధ్ర టోర్నమెంటుని విజయవంతం చేద్దామని ఎంపీడీఓ రామనాథరెడ్డి పిలునిచ్చారు. వెంగళరాజుకుప్పం క్రీడా మైదానంలో శుక్రవారం పంచాయతీ కార్యదర్శులకు, వలంటీర్లకు, పీఈటీలకు ఆయన సమావేశం నిర్వహించారు. 15 ఏళ్లు నిండిన వారందరూ పేర్లు రిజిస్ట్రేషన్ చేసుకుని క్రీడల్లో పాల్గొనాలని కోరారు. టోర్నమెంట్‌లో క్రికెట్, వాలీబాల్, కబడ్డీ, ఖోఖో, బ్యాడ్మింటన్ పోటీలు నిర్వహించనున్నట్లు తెలిపారు.

విద్యార్థులకు ట్యాబ్‌ల పంపిణీ



వెదురుకుప్పం: ట్యాబ్‌లు అందజేస్తున్న ఉపాధ్యాయులు, నేతలు

వెదురుకుప్పం: మండలంలోని ఆళ్లమడుగు జెడ్పీ ఉన్నత పాఠశాలలో 8వ తరగతి విద్యార్థులకు శుక్రవారం ట్యాబ్‌లు పంపిణీ చేశారు. సింగిల్‌విండో చైర్మన్ లోకనాథ రెడ్డి, ప్రధానోపాధ్యాయులు పిల్లలకు ట్యాబ్‌లను అందజేసి, ఆవశ్యకతను వివరించారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు పద్మనాభరెడ్డి, స్థానిక నాయకులు ధనంజయరెడ్డి, దామోదరరెడ్డి పాల్గొన్నారు.

వెంగళరాజుకుప్పంలో..

పాలసముద్రం : మండలంలోని వెంగళరాజుకుప్పం హైస్కూల్లో శుక్రవారం ప్రధానోపాధ్యాయుడు చక్రధరరావ్ ఆధ్వర్యంలో ప్రభుత్వం పంపిణీ చేసిన ట్యాబ్‌లని విద్యార్థులకు అందజేశారు. హెచ్‌ఎం మాట్లాడుతూ 8వ తరగతి విద్యార్థులకు రూ.35 వేలు విలువ గల ట్యాబ్‌లను ప్రభుత్వం ఉచితంగా అందిస్తోందని చెప్పారు. విద్యార్థులు ట్యాబ్‌ను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. అనంతరం విద్యార్థులకు ట్యాబ్‌లు పంపిణీ చేశారు.



ట్యాబ్‌లు పంపిణీ చేస్తున్న హెచ్‌ఎం చక్రధరరావు

పింఛనుదారుల్లో 'నూతన' సంతోషం

గత ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఏటా పింఛన్ కానుక మొత్తాన్ని పెంచుకుంటూ వస్తున్నారు. జనవరి నుంచి పింఛన్ కానుక మరో రూ.250 పెరగనుంది. కొత్త ఏడాదిలో పింఛన్ లబ్ధిదారులు రూ.3 వేలు అందుకోనున్నారు. గతంలో పింఛను కోసం పడిన అగచాట్లన్నీ జగనన్న ప్రభుత్వంలో తొలగిపోయాయి. పింఛనుదారులు ఎలాంటి కష్టం లేకుండా గడపవద్దనే పింఛను అందుకుంటూ సంతోషంగా గడుపుతున్నారు.

- జనవరి నుంచి పింఛన్ రూ.3 వేలు
- కొత్త సంవత్సరంలో అదనపు కానుక
- మండలంలో 3,787 మందికి లబ్ధి



నాడు పింఛను నగదు కోసం రచ్చబండ వద్ద వేచి ఉన్న అవ్వా–తాతలు(ఫైల్)



నేడు ఇంటి వద్దే పింఛన్ అందిస్తున్న వలంటీరు

పాలసముద్రం : వృద్ధులు, వితంతువులు, ఒంటరి మహిళలకు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం నూతన సంవత్సరం అదనపు కానుక అందిస్తోంది. వైఎస్సార్ పింఛన్ కానుక పేరుతో ప్రతి నెలా ఠంచనుగా ప్రభుత్వం రూ.2,750 అందిస్తోంది. దీనికి అదనంగా రూ.250 కలిపి మొత్తం రూ.3000 పింఛను అందించేందుకు ప్రభుత్వం ఏర్పాట్లు చేస్తోంది. ఈ మేరకు మంత్రివర్గం ఆమోదం కూడా తెలిపింది. జనవరి నుంచి పెంచిన పింఛను కానుక అందించాలని అధికారులకు ఉత్తర్వులు అందాయి. అధికార యంత్రాంగం ఆ దిశగా ఏర్పాట్లు చేస్తోంది.

మండలంలో 3787 మందికి లబ్ధి

వైఎస్సార్ పింఛన్ కానుక లబ్దిదారుల ఎంపిక ప్రక్రియ అత్యంత పారదర్శకంగా జరుగుతోంది. దరఖాస్తు చేసుకున్న వెంటనే వివరాలన్నీ పరిశీలించి, పార్టీలకతీతంగా అర్హులకు పింఛన్ అందేలా అధికారులు చర్యలు తీసుకుంటున్నారు. ప్రస్తుతం మండలంలో 3787 మందికి ప్రభుత్వం వైఎస్సార్ పింఛన్ కానుక అందిస్తోంది. జనవరి నుంచి వీరందరికీ రూ.3 వేలు పింఛను అందనుంది.


గతంలో అమ్మో ఒకటో తారీఖు

గత ప్రభుత్వంలో పింఛన్‌దారులు అమ్మో ఒకటో తారీఖు అనుకునేవారు. ఎక్కడ పింఛన్ ఇస్తున్నారో తెలియక వృద్ధులు, దివ్యాంగులు, మహిళలు తీవ్ర అవస్థలు పడేవారు. కొత్త పింఛన్ కోసం జన్మభూమి కమిటీల చుట్టూ ప్రదక్షిణలు చేయాల్సి వచ్చేది. కేవలం పచ్చ చొక్కావారికి, వారి సానుభూతి పరులకు మాత్రమే లబ్ధి చేకూర్చేందుకు ప్రాధాన్యతనిచ్చేవారు. పింఛన్ ఇచ్చే పంచాయతీ కార్యదర్శి గ్రామంలో ఉన్నాడో? లేడో? తెలుసుకోవడానికే నానా తిప్పలు పడేవారు. సెక్రటరీ వస్తారంటే తెల్లవారుజాము నుంచి పనులన్నీ విడిచిపెట్టి క్యూలో పింఛన్ పుస్తకం పెట్టి కాసుక్కూచునేవారు. అది కూడా కేవలం రూ.వెయ్యి మాత్రమే ఇచ్చారు. తీరా ఎన్నికల ముందు నెల నుంచి మరో రూ.వెయ్యి పెంచి రూ.2వేలు చేశారు.

నేడు ఆహా ఒకటో తేదీ

అయితే వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం వచ్చాక సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి పింఛన్ల పంపిణీలో విప్లవాత్మక మార్పులు తీసుకొచ్చారు. అర్హులైన వారందరికీ పార్టీలకతీతంగా పింఛన్ మంజూరు చేసేలా చర్యలు చేపట్టారు. వృద్ధులు, దివ్యాంగులు ఇబ్బంది పడకుండా ఇంటివద్దకే పింఛన్ అందజేసే వలంటీర్ వ్యవస్థను తీసుకొచ్చారు. పథకాలను పకడ్బందీగా అమలు చేసేందుకు సచివాలయ వ్యవస్థను ఏర్పాటు చేశారు. దీంతో పింఛన్ల పంపిణీలో ఉన్న ఇబ్బందులన్నీ తొలగిపోయాయి. తెల్లవారుజామునే గడప దాటాల్సిన పనిలేకుండా వలంటీర్లే వచ్చి, పింఛన్ నగదు అందించి వెళ్లేలా ఆదేశాలు ఇచ్చారు. దీంతో ఇంటి వద్దనే ఉంటూ ఒకటో తేదీన జీతం అందుకుంటున్నారు. పింఛనుదారులందరూ ఎంతో సంతోషంగా ఒకటో తేదీ ఎప్పుడు వస్తుందా అని ఎదురుచూస్తున్నారు. పింఛను అందుకోగానే ఆహా ఒకటో తారీఖు అనుకుంటూ మురిసిపోతున్నారు.


చెప్పాడంటే చేస్తాడంతే



సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ఏదైనా చెబితే తప్పకుండా చేస్తారనే నమ్మకం ఉంది. ఎన్నికల్లో ఇచ్చిన హామీలన్నీ అమలు చేశారు. పింఛన్ మొత్తం చెప్పినట్లే ఏటా పెంచుతున్నారు. జగనవరి నుంచి రూ 3 వేలు పింఛన్ ఇస్తానన్నారు. ఇచ్చిన మాటను నెరవేర్చుకున్న వైఎస్ జగన్‌కు అండగా నిలబడతాం,

– గోవిందమండడి, పాలసముద్రం


పెద్ద కొడుకులా ఆదుకుంటున్నాడు



ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి మమ్మల్ని పెద్ద కొడుకులా ఆదుకుంటున్నాడు. మాకు కుటుబంలో గౌరవం లభిస్తుందంటే ఆయన ఇచ్చే పింఛనే కారణం. జగన్ బాబు మాటిస్తే మడమతిప్పడు. ఆ బాబు నూరేళ్లు చల్లగా ఉండాలి. మాలాంటి వారిని మరింత ఆదుకోవాలి. మా ఆశీసులెప్పుడూ జగన్‌కే ఉంటాయి.

– పాపమ్మ, కన్నికాపురం


ఆర్థిక భరోసా



ప్రతి నెలా మాఇంటి తలుపు తట్టి వలంటీర్లు పింఛన్ అందిస్తున్నారు. గతంలో పింఛను తీసుకోవాలంటే ఎంతో ఇబ్బంది పడేవాళ్లం. ఈ వైఎస్సార్ పింఛన్ కానుక నాలాంటి ఎంతో మంది గౌరవంగా జీవించేలా చేస్తోంది. అందరూ జగన్‌కు రుణపడి ఉంటారు. ఎందరికో సీఎం ఆర్థిక భరోసా ఇస్తున్నారు.

– వీ.మురగయ్య, ఎస్‌కేఆర్ పురం

పింఛన్ పంపిణీ చరిత్రాత్మకం



ఎప్పుడు లేని విధంగా ఈ ప్రభుత్వం పింఛన్ పంపిణీ అందించే విధానం చరిత్రలో నిలిచిపోతుంది. ప్రతి నెలా ఆఖరు రోజునే పింఛన్ పంపిణీకి వలంటీర్లతో సమావేశం ఏర్పాటు చేస్తున్నాం. ఎలాంటి ఇబ్బందులు లేకుండా మొదటి తేదీనే పింఛన్ పంపిణీ జరిగేలా వలంటీర్లకు దిశ నిర్దేశం చేస్తున్నాం.

–రామనాథరెడ్డి, ఎంపీడీఓ

వేణుగోపాలునికి పూర్వ వైభవం తీసుకురావాలి

కార్వేటినగరం: సంస్థానాధీశులు సంతానం కోసం నిర్మించిన శ్రీ సంతాన వేణుగోపాలస్వామి ఆలయానికి పూర్వ వైభవం తీసుకురావాలని మాజీ ఎంపీటీసీ సభ్యుడు పురుషోత్తంరాజు కోరారు. స్కంధపుష్కరిణి వద్ద ఆయన శుక్రవారం మీడియాతో మాట్లాడారు. టీటీడీలో విలీనమైన తరువాత తిరుమలలో నిర్వహించే ప్రతి కార్యక్రమాన్ని వేణుగోపాల స్వామి ఆలయంలోను నిర్వహిస్తూ వచ్చారని గుర్తుచేశారు. అయితే కరోనా అనంతరం ఆలయంలో అధికారి అందుబాటులో లేకుండా పోవడంతో, పారిశుద్ధ్యం లోపించి భక్తులకు ఇబ్బంది కరంగా మారిందన్నారు. అధికారులు స్పందించి వేణుగోపాలస్వామి ఆలయానికి పూర్వవైభవం తీసుకు రావాల్సిన అవసరం ఎంతైనా ఉందని చెప్పారు.

అక్రమాలు గుర్తించేందుకే తనిఖీలు



మాట్లాడుతున్న డ్వామా పీడీ గంగాభవాని

పాలసముద్రం : ఉపాధి హామీ పనుల్లో అవకతవకలు గుర్తించేందుకే సామాజిక తనిఖీలు చేపడుతున్నట్లు డ్వామా పీడీ గంగాభవాని తెలిపారు. మండల ప్రజాపరిషత్ కార్యాలయ ఆవరణలో శుక్రవారం ఎంపీడీఓ రామనాథరెడ్డి, ఏపీఓ మార్గరెట్ సమక్షంలో 17వ సామాజిక తనిఖీ ప్రజావేదిక నిర్వహించారు. మండలంలో ఉపాధిహామీ పథకంలో గత ఏడాది నిర్వహించిన 907 పనుల్లో రూ.4.99 కోట్లు ఖర్చు చేశారు. వీటిని వారం రోజులపాటు చేసిన తనిఖీల్లో అక్రమాలను గుర్తించారు. మస్టర్‌లో కొట్టివేతలు, ఎంబుక్‌లో కొలతల తేడాలు, నేమ్‌బోర్డులు పెట్టలేదని అధికారుల దృష్టికి తీసుకొచ్చారు. రూ.10,500 రికవరీ చేశారు. కార్యక్రమంలో పీహెచ్‌సీ కమిటీ చైర్మన్ ఎస్ శివప్రకాష్ రాజు, జెడ్పీటీసీ సభ్యుడు అన్బలగన్, వైస్ ఎంపీపీ శేఖర్ యాదవ్, మండల కన్వీనర్ తులసిరామ్ యాదవ్, ఎంపీటీసీ గోవిందరాజ్, సర్పంచ్‌లు అయ్యప్ప, మహేష్, ఐకేపీ ఏపీఎం ఫరీద్ మస్తాన్, ఇంజినీర్ అసిస్టెంట్లు, ఉపాధి హామీ కూలీలు పాల్గొన్నారు.